అమృత్-2 పనులకు ప్రణాళిక

- పురపాలికలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు
- డీపీఆర్‌ను తయారు చేసిన ఇంజినీరింగ్ అధికారులు



రాయదుర్గం మున్సిపల్ కార్యాలయం

రాయదుర్గం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన అమృత్–2 పథకం నిధులతో పట్టణాల్లో తాగునీటి వనరులను మెరుగుపరచుకోవటానికి సన్నాహాలు మొదలయ్యాయి. 70 వేలకు పైగా జనాభా ఉన్న రాయదుర్గం పట్టణానికి వైఎస్సార్ సమ్మర్ స్టోరేజీ నీటి పథకమే దిక్కైంది. ఈ పథకం లేకుంటే బిందెడు నీటికి బండెడు కష్టాలు తప్పని పరిస్థితి. నేటికీ రెండు లేదా మూడు రోజులు నీరందకపోతే తల్లడిల్లే పరిస్థితి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చలువతో ఈ పథకాన్ని పునరుద్ధరించి పట్టణ ప్రజల దాహార్తి తీరేలా కృషి చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం కణేకల్లు సమ్మర్ స్టోరేజీ నుంచి రాయదుర్గం పట్టణానికి తాగునీరు చేర్చే పైప్‌లైన్, పంపింగ్ మోటర్ల మరమ్మతులు లాంటి కీలక అంశాలను గాలికొదిలేశారు. దీంతో క్రమేణా నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో తాగునీటి వనరుల మెరుగు పరచుకోవడానికి అమృత్–2 పథకం వినియోగంలోకి రావడంతో అధికారులు ఆ దిశగా కసరత్తు మొదలుపెట్టారు.

రూ.32.82 కోట్లతో ప్రతిపాదనలు..

అమృత్–2 పథకం ద్వారా తాగునీటి వనరుల అభివృద్ధి కోసం రూ.33.82 కోట్లతో ఇంజినీరింగ్ అధికారులు డీపీఆర్ నివేదికలను సిద్ధం చేశారు. కణేకల్లు ఎస్ఎస్ ట్యాంకు నుంచి రాయదుర్గం ఫిల్టరేషన్ పాయింట్ వరకు (13 కిలోమీటర్లు), 4 పంప్ సెట్ల సహా నీటిని తీసుకెళ్లేందుకు రూ.20 కోట్లు, పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో 4 ఓహెచ్ఆర్ ట్యాంకుల నిర్మాణాలకు రూ.5.62 కోట్లు, పలు వార్డుల్లో 22 కిలోమీటర్ల వరకు పైప్‌లైన్ల మరమ్మతులు, పునరుద్ధరణ కోసం రూ.5.50 కోట్లు, జగనన్న కాలనీల సహా, పట్టణంలోని 4,500 కొళాయి కనెక్షన్ల కోసం రూ.2.7 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదికలు సమర్పించారు. ఈ నిధులు మంజూరుకాగానే టెండర్లు పిలిచే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రజా ఆమోదం మేరకే ప్రతిపాదనలు



ప్రజా ఆమోదం, ఇబ్బందుల దృష్ట్యా అమృత్–2 పథకం ద్వారా శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం రూ.33.82 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసి నివేదికలు పంపాం. నిధులు మంజేరు కాగానే టెండర్లు పిలుస్తాం. తాగునీటి అవసరాలకే ఎక్కువ ప్రాధాన్యత కల్పించాం. నిధులు మంజూరైతే ప్రతి పైసా సద్వినియోగ పరిచేలా ఇంజనీరింగ్ అధికారులు సమగ్ర ప్రణాళికలు తయారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి నివేదికలు వెళ్లాయి.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

సైకిల్ తొక్కండి.. ఆరోగ్యం మెరుగు పరుచుకోండి



ఉరవకొండ: ర్యాలీ నిర్వహిస్తున్న కాకుంట్ల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది



కూడేరు: ఉదిరిపికొండలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌ఓ లోకేశ్వరి



బొమ్మనహాళ్: సైకిల్ మారథాన్ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

ఉరవకొండ/కూడేరు/వజ్రకరూరు/బొమ్మనహాళ్: రోజూ సైకిల్ తొక్కడం వల్ల అనేక రోగాల నుంచి దూరంగా ఉండటమే కాకుండా ఎంతో చురుగ్గా ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు సూచించారు. హెల్త్ మేళా కార్యక్రమంలో భాగంగా ఉరవకొండ, కూడేరు, వజ్రకరూరు, బొమ్మనహాళ్ మండలాల్లో మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఉరవకొండ మండలంలోని పెద్దకొకుంట్ల పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనికేత్, డాక్టర్ చందన, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ మాట్లాడుతూ రోజు సైక్లింగ్ చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. హెచ్ఎం విజయభారతి, ఉపాధ్యాయులు, ఆరోగ్య సహాయకులు, ఏఎన్ఎం నీలావతి తదితరులు పాల్గొన్నారు.

- కూడేరు మండలంలోని ఉదిరిపికొండ గ్రామంలో విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి మిడిల్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) లోకేశ్వరి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.
- వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వైద్యులు తేజస్వి, సర్దార్‌వలి, సీహెచ్‌ఓ గంగాధర్, ఎంపీహెచ్‌ఈఓ గురుప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, హెచ్ఎం మనోహర్, హెల్త్ అసిస్టెంట్ బాబావలి, పీడీ సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.
- బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట ఉన్నత పాఠశాలలో యాస్టీ కాన్సర్‌లో భాగంగా సైకిల్ మారథాన్ కార్యక్రమం నిర్వహించారు. అంటు వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు గీతా భార్గవి, కుమారరాజా, హెల్త్ ఎడ్యుకేటర్ విజయ భారతి, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు



కంబదూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ మండలంలోని అచ్చంపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేయకుండా అధికారులు వదిలేశారు. మంగళవారం 'అచ్చంపల్లిలో కోడ్ ఉల్లంఘన' అనే వార్త సాక్షి దినపత్రికలో వెలువడింది. వార్తకు అధికారులు వెంటనే స్పందించి ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఈఈ శేషాద్రి శేఖర్

కళ్యాణదుర్గం: రైతులకు సంబంధించి విద్యుత్ సమస్యల పరిష్కారమే కర్తవ్యమని కళ్యాణదుర్గం ఈఈ శేషాద్రి శేఖర్ అన్నారు. స్థానిక ఈఈ చాంబర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కళ్యాణదుర్గం సబ్ డివిజన్లో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రత్యేకంగా నియోజకవర్గంలో కొత్త సబ్ స్టేషన్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత కొన్ని రోజులుగా విద్యుత్ శాఖపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. ఉద్యోగులు క్రమశిక్షణతో ఉండాలన్నదే మా సంకల్పం అన్నారు. రైతులు, వ్యవసాయానికి డీపీలకు నగదు చెల్లించిన వెంటనే వర్క్ ఆర్డర్ కూడా కొద్ది రోజుల వ్యవధిలోనే రిలీజ్ చేస్తామన్నారు. వీలైనంత తొందరలోనే రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తామన్నారు. వేసవిలో లోఓల్టేజ్ సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్‌

కళ్యాణదుర్గం/ఉరవకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంలో భాగంగా ఈనెల 15న విద్యుత్ అదాలత్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఈఈ శేషాద్రి శేఖర్ తెలిపారు. అదాలత్‌కు పరిష్కార వేదిక అధ్యక్షుడు రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు ఎస్ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యుడు జి.ఈశ్వరయ్య హాజరవుతారన్నారు. కళ్యాణదుర్గం, ఉరవకొండ డివిజన్ పరిధిలోని రైతులు, విద్యుత్ వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు సచివాలయ కన్వీనర్ల సమావేశం



వజ్రకరూరు: సమావేశ స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

విడపనకల్లు: మండల కేంద్రంలోని సినిమా హాల్ ఆవరణలో గురువారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్ల ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ బసన్న, ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ సభ్యుడు హనుమంతు, మండల సచివాలయ కన్వీనర్, రాష్ట్ర నేత భరత్‌రెడ్డి తెలిపా. మంగళవారం వరు విలేకరుల సమావేశం నిర్వహించారు. మండలంలోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలన్నారు.

జయప్రదం చేయండి

వజ్రకరూరు: మండల కేంద్రంలోని రాజశేఖర్‌రెడ్డి జిన్నాలో ఈనెల 16న మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశాన్ని జయప్రదం చేయాలని ఉరవకొండ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి రాచన్నగౌడ్, సర్పంచు మోనాలిసా సూచించారు. మండల కేంద్రంలోని రాజశేఖర్‌రెడ్డి జిన్నాలో నిర్వహించనున్న సమావేశానికి సంబంధించిన స్థలాన్ని మంగళవారం వారు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సమావేశానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు, చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.ప్రణయ్‌కుమార్‌రెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా కార్యదర్శి వశికెర రమేష్, యువజనవిభాగం అధ్యక్షుడు డిష్ సురేష్, ఎఫ్‌పీఓ చైర్మన్ అమర్‌నాథ్, ఉపాధ్యక్షుడు ఉస్మాన్, మండల కార్యదర్శి నల్లబోతుల రాజు, ఎస్టీసెల్ కార్యదర్శి సామానాయక్, కిసాన్ సెల్ కార్యదర్శి వీరభద్రగౌడ్, పీఏసీఎస్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, సర్పంచులు కురుబ లక్ష్మయ్య, భూమా కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోల్పోతామనే మంత్రిపై ఆరోపణలు

కుందుర్పి: కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మంత్రి ఉషాశ్రీచరణ్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక, ఉనికిని కోల్పోతామనే భయంతో.. టీడీపీ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు దళితులను అడ్డం పెట్టుకుని మంత్రిపై అసత్య ఆరోపణలు చేయిస్తున్నారని మండల దళిత నాయకులు ఆరోపించారు. మంగళవారం ఎంపీపీ కమలమ్మ, జెడ్పీ మాజీ సభ్యుడు రాజగోపాల్, సర్పంచ్ గంగాధర, మాజీ సర్పంచులు లింగప్ప, తిప్పేస్వామి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జంబుగుంపల తిప్పేస్వామి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కోడ్ ఉల్లంఘించిన టీడీపీ ఇన్‌చార్జ్ , నాయకులు ఓ దళిత యువకుడిచే మంత్రిపై నిరాధారమైన ఆరోపణలు చేయించడం సిగ్గుచేటన్నారు. మంత్రి నాలుగేళ్ల కాలంగా నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందారన్నారు. ఉమాను కళ్యాణదుర్గం నుంచి సొంత పార్టీ వాళ్లే వెళ్లగొట్టే రోజులు దగ్గర్లో ఉన్నాయన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో టీడీపీ నాయకులు చిచ్చుపెడుతూ అల్లర్లు సృష్టిస్తున్నారని వారు ఆరోపించారు.

కుందుర్పిలో గౌడసంద్రమ్మ గ్రామోత్సవం



కుందుర్పి: అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



శెట్టూరు: గాపు కార్యక్రమం తిలకిస్తున్న జనం

కుందుర్పి: మండల కేంద్రంలో మంగళవారం గ్రామ దేవత గౌడచంద్రమ్మ అమ్మవారి గ్రామోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. కుందుర్పిలోని ఆకుల లింగప్ప కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కర్ణాటకలోని గౌడచంద్రం నుంచి అమ్మవారిని ఇక్కడకు తీసుకువచ్చి ఉత్సవం నిర్వహించారు. రాత్రికి అమ్మవారి ఊరేగింపు గ్రామశాంతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

కాళ్లగట్టమ్మ నెల జాతర

శెట్టూరు: మండల కేంద్రంలో కాళ్లగట్టమ్మ జాతర ముప్పై రోజులు పూర్తి చేస్తున్న సందర్భంగా నెల జాతరను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం లింగదీర్లపల్లి వంక వద్దకు అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి జలధి నిర్వహించారు. అక్కడ కాళ్లగట్టమ్మ గ్రామ దేవతకు ఎంపీపీ లక్ష్మీదేవి, గ్రామ పెద్దలు, ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గావు కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు.

వైభవంగా గాలిమారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన గాలిమారెమ్మ విగ్రహం

గుమ్మఘట్ట: మండలంలోని వై.గుండ్లపల్లిలో గాలిమారెమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గ్రామస్తులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ హోమాలు, ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరిపించారు. గ్రామస్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట్ల ఉమేష్, వైస్ సర్పంచ్ రామాంజనేయులు, చిత్తయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా 'గోవు ఆలింగన దినోత్సవ' ర్యాలీ

రాయదుర్గంటౌన్: వీహెచ్‌పీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో గోవు ఆలింగన దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ పట్టణశాఖ అధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ పట్టణంలో యజమానుల ఆదరణకు నోచుకోక అనేక పశువులు రోడ్లపై తిరుగుతూ అనారోగ్యం పాలవుతున్నాయని, వాటిని గోశాలలకు లేక ఆసక్తి ఉన్న రైతులకు అందజేయనున్నట్లు తెలిపేందుకు గోరక్షక దళం ఏర్పాటు చేశామన్నారు. ర్యాలీ అనంతరం తహసీల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. పశువుల యజమానులు స్పందించకపోతే మార్చి 1 నుంచి గోవులను గోశాలలకు తరలించడం లేదా ఆసక్తి గల రైతులకు ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు సాయిప్రసాద్, సత్యనారాయణ, సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నగదు వితరణ

ఉరవకొండ: మండలంలోని చిన్నముస్టూరు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు అనంతపురానికి చెందిన హుందాయ్ స్టీలు ప్రైవేట్ లిమిటెడ్ తరపున డిజిటల్ లైబ్రరీ, క్యాడ్ ల్యాబ్ ఏర్పాటుకు రూ.5.61 లక్షలు మంగళవారం వితరణగా అందించారు. ప్రిన్సిపాల్ అశ్రాఫ్‌ఆలీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హుందాయ్ కంపెనీ ఏండీ జాయ్‌మాన్ కిమ్ మాట్లాడుతూ సాంకేతిక విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరంని ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వై.సురేష్‌బాబు, డాక్టర్ సులోచన, అలీహసేన్, మోసెస్, రవీంద్రనాథ్, హుందాయ్ కంపెనీ కార్యదర్శి వెంకటరమణ, ఐటీ మేనేజర్ మదన్‌మోహన్‌రెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ సంగీత పాల్గొన్నారు.

మంటల్లో అటవీ ప్రాంతం

కుందుర్పి: పశువుల కాపర్లు నిప్పు పెట్టడంతో మండలంలోని జంబుగుంపల అటవీప్రాంతం రెండు రోజులుగా మంటల్లో చిక్కుకుంది. అటవీ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నా ఫలితం లేకపోయింది. పెద్ద కొండ, మల్లికాసిన కొండ, బోరప్పకనుమ, తుమ్మర్లగొంది తదితర అడవులు ఎడతెరపి లేకుండా కాలుతూనే ఉన్నాయి. ముఖ్యంగా వెదురు, జాలి, తుమ్మ, నీరద్ది, గాలిబుడుగు, టేకు వంటి విలువైన వేలాది వృక్షాలు కాలిపోయాయి. అలాగే ఎన్నో వన్య ప్రాణులు మృత్యువాత పడ్డాయి. రెండు రోజులుగా 3 వేల ఎకరాల అడవులు కాలిపోయినట్లు తెలుస్తోంది.

జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపిక

కళ్యాణదుర్గం: జాతీయ స్థాయి జూడో పోటీలకు పట్టణంలోని స్థానిక గోల్డెన్ బెల్స్ స్కూల్ విద్యార్థి బి.చరణ్ ఎంపికయ్యాడు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ 60 కిలోల విభాగంలో చరణ్ గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ విషయాన్ని గోల్డెన్ బెల్స్ స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జాన్ పీటర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు రూపేష్, సురేష్, మనోహర్, వ్యాయామ ఉపాధ్యాయుడు తిప్పేస్వామి తదితరులు విద్యార్థిని అభినందించారు.

నిందితున్ని శిక్షించాలి

కూడేరు: గుంటూరు జిల్లాలో అంధ బాలికను గంజాయి మత్తులో రాజు అనే వ్యక్తి కిరాతకంగా హత్య చేయడం చాలా దారుణమని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న కోరారు. మంగళవారం కూడేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా నిందితున్ని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

రైతు భరోసా కేంద్రం తనిఖీ

రాయదుర్గం రూరల్: మండలంలోని ఆవులదట్ల రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఏడీఏ లక్ష్మానాయక్ తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. 40 శాతం రాయితీపై అందిస్తున్న వ్యవసాయ యంత్రసేవా కేంద్రాల ఏర్పాటు, తద్వారా రైతులకు జరిగే మేలు గురించి ఆయన వివరించారు. అలాగే రూ.300 చందా చెల్లించి రైతు భరోసా మాస పత్రిక తీసుకునేలా రైతులను చైతన్య పరచాలన్నారు.

ఈ- క్రాప్ తప్పనిసరి

విడపనకల్లు: మండలంలోని చీకలగురికి, వేల్పుమడుగు గ్రామాల్లో ఉరవకొండ ఏడీఏ పద్మజ మండల వ్యవసాయాధికారులతో కలిసి మంగళవారం సూపర్ చెక్ లో భాగంగా ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. ప్రతి రైతూ కూడా తప్పని సరిగా ఈ- క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రాఘవేంద్ర,వీఏఏ లక్ష్మన్న, కుళ్లాయినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మొండి బకాయిలు చెల్లించాలి

కూడేరు: మొండి బకాయిలు చెల్లించకపోతే విద్యుత్ సర్వీస్‌లు రద్దు చేస్తామని ట్రాన్స్ కో ఏడీఏ శ్రీనివాసులు రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో మొండి బకాయిల వసూళ్లపై సిబ్బందితో సమావేశమయ్యారు. మొండి బకాయిలను వసూలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 448 మంది గృహ విద్యుత్ వినియోగదారులు మూడు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో రూ.25.43 లక్షలు పెండింగ్ ఉందన్నారు. అదే విధంగా 6,117 మంది వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు కొన్నేళ్లుగా బిల్లులు చెల్లించకపోవడంతో సుమారుగా రూ.62.40 లక్షలు పెండింగ్ ఉందన్నారు. వారంతా నెలలోపు పెండింగ్ బిల్లులను చెల్లించాలని, లేదంటే విద్యుత్ సరఫరా ఆపేస్తామన్నారు కార్యక్రమంలో ఏఏఓ అర్జిమ , ఏఈ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

కంబదూరు: మండల కేంద్రంలోని మల్లీశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న 500మంది భక్తులకు మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92లో పదో తరగతి చదివిన విద్యార్థులు అన్నదానం చేశారు. అంతకుముందు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

నేడు నాగుల ప్రతిష్ట

కూడేరు: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో బుధవారం నాగుల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు మంగళవారం తెలిపారు. అలాగే 16న అశ్వర్థ కల్యాణ మహోత్సవం, అన్నదాన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ కింగ్ ఆఫ్ షాలేమ్ క్రైస్ట్ చర్చిలో బుధవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పాస్టర్ కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రి వైద్య బృందం సహకారంతో శిబిరం నిర్వహిస్తామన్నారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిర్వహించే శిబిరంలో గుండె జబ్బుతో బాధపడే వారు ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలన్నారు.

గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిరికల్చర్ విద్యార్థినులకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో గ్యాస్ ప్రమాదాల నివారణ, జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులతోపాటు ఉపాధ్యాయులకు గ్యాస్ వినియోగం, వాడకం, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన మెలకువలపై ప్రయోగాత్మకంగా గ్యాస్ మెకానిక్ ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాయదుర్గం రూరల్: ఇంటర్ యూనివర్సిటీ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న బి. నరసింహులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రఘురామమూర్తి తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు మంగళవారం అభినందించారు. సౌత్ జోన్ పోటీలకు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమన్నారు. ఈనెల 20 నుంచి మార్చి 3 వరకూ బెంగళూరులో నిర్వహించే ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ పోటీల్లో రాణించాలని అధ్యాపకులు ఆకాంక్షించారు.

'తలశిల'కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ తదితరులు

ఉరవకొండ: ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌ను మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ నెల 5న తలశిల రఘురామ్ భార్య స్వర్ణకుమారి అనారోగ్యంతో కన్నుమూశారు. మాజీ ఎమ్మెల్యే విజయవాడలోని తలశిల నివాసానికి వెళ్లి స్వర్ణకుమారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తలశిల రఘురామ్‌ను పరామర్శించారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి, ఎమ్మెల్యేలు శంకర్‌నారాయణ, సిద్దారెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి



ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీపీ, జెడ్పీ మాజీ సభ్యుడు తదితరులు

విడపనకల్లు: వైఎస్సార్‌సీపీ తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించాలని ఎంపీపీ కరణం పుష్పావతి, మండల సచివాలయ కన్వీనర్ భరత్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు సింగాడి తిప్పయ్య,మాజీ సర్పంచు కరణం భీంరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని గడేకల్లు, ఎన్.తిమ్మాపురం, హంచనహాల్ గ్రామాల్లో వారు ప్రచారం నిర్వహించారు. మార్చి 13న జరిగే ఎన్నికల్లో రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రాడ్యుయేట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఉరవకొండ పట్టభద్రుల ఎన్నికల కో ఆర్డినేటర్ రాజారెడ్డి, కో ఆప్షన్ మెంబర్ లతీఫ్, ఎంపీటీసీ ఓబుళేసు, సర్పంచు సుశీల, ఉప సర్పంచు పార్వతి, నాయకులు వడ్డే ఆంజినేయులు, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ అంతరాయం కలిగించొద్దు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

కుందుర్పి: వేసవిలో వ్యవసాయానికి విద్యుత్ అంతరాయం లేకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 2500 ఎకరాలకు పైగా రబీ పంటలు సాగయ్యాయని, సకాలంలో మోటార్లకు విద్యుత్ సరఫరా చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించి కూలీల సంఖ్యను పెంచాలని జంబుగుంపల సర్పంచ్ గంగాధర కోరారు. సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఎంపీపీ కమలమ్మ సూచించారు. జంబుగుంపల–బెస్తరపల్లి రోడ్డును పునరుద్ధరించాలని సర్పంచ్ మమత తదితరులు సూచించారు. ఆర్‌బీకేల్లో నాణ్యమైన ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ మహేష్ సూచించారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, వైస్ ఎంపీపీలు బీజప్ప, శ్రీలక్ష్మీ, డీటీ తిప్పేస్వామి, పశువైద్యాధికారి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

వీరసైనికుల త్యాగాలు మరువలేం



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

కణేకల్లు: దేశ రక్షణ కోసం పుల్వామాలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో అమరులైన వీరసైనికుల త్యాగాలను దేశం ఎన్నటికీ మరవదని ఎస్ఐ దుగ్గిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం రాత్రి యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో అమరులైన వీరజవాన్ల కోసం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం వీరజవాన్లకు ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ అక్కులప్ప, యువకులు ఘనంగా నివాళులర్పించారు.